సాక్షి చిత్తూరు

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



మిట్టపాలెం.. శోకసంద్రం

మిట్టపాలెంలో రోడ్డు ప్రమాద మృతులకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. - IIలో



ఫలించిన 'అదాలత్'

పలమనేరులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 14 ఏళ్ల కేసును పరిష్కరించారు. - IIలో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	25
తిరుపతి	35	26
తిరుమల	30	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

పంట పొలాలపై ఏనుగు దాడి



ఏనుగు నేలకూల్చిన కొబ్బరి చెట్టు

పెద్దపంజాణి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె వద్ద పంటపొలాలపై శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు విరుచుకుపడింది. మార్కొండారెడ్డి, అమరారెడ్డి అనే రైతులు సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేసింది. అంజిరెడ్డి అనే రైతులకు చెందిన కొబ్బరి చెట్లను నేలకూల్చింది. పచ్చగడ్డిని పూర్తిగా ఆరగించింది. బాధితులు మాట్లాడుతూ నెల రోజులుగా పంట పొలాలపై గజరాజుల విధ్వంసం కొనసాగుతూనే ఉందన్నారు. ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఒంటరి ఏనుగును అటవీప్రాంతంలోకి మళ్లించాలని కోరారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొత్తం 3,208 సర్వీసులకు గాను తిరుపతి ఆపరేషన్‌లో 97, తిరుపతి రూరల్ -52, పుత్తూరు- 72, చిత్తూరు అర్బన్- 61, చిత్తూరు రూరల్- 51, మదనపల్లె- 62, పీలేరు- 28, పుంగనూరు పరిధిలో 76 మొత్తం 499 కనెక్షన్లలో విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. సర్వీసుదారులకు రూ.11.95 లక్షలు జరిమానా విధించినట్లు వివరించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు రమేష్, కరుణకుమార్ తదితరులు

చిత్తూరు అర్బన్: కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చిత్తూరు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి రమేష్ తెలిపారు. శనివారం జిల్లా న్యాయస్థానాల ఆవరణలో ఇన్‌చార్జి జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్‌తో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ అదాలత్‌లో ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారుల కోర్టుల చుట్టూ తిరిగే అవసరము ఉండదని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్ మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి ప్రత్యక్షంగా హాజరు కాలేని వారికి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఉందన్నారు. అదాలత్ కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35 బెంచ్‌లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వెన్నెల, శ్రీనివాస్, మాధవి, షేక్ బాబజాన్, డి.ఉమాదేవి, శ్రీనివాస్ మూర్తి, న్యాయవాదుల సంఘ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 27వ తేదీన ఏటా ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా టూరిజం అధికారి నరేంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగం లో విశిష్ట సేవలందించిన వారికి ఆరోగ్యకరమైన పోటీలు నిర్వహించి అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు www.aptourism.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 19 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మింగలేక.. కక్కలేక..!



- చంద్రబాబు అరెస్ట్‌కు నామమాత్రంగా నిరసనలు
- ప్రజాస్పందన లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తమ్ముళ్లు
- అక్కడక్కడా ఆందోళనకు దిగి మమ అనిపించిన టీడీపీ నేతలు

సాక్షి, చిత్తూరు : చంద్రబాబు అరెస్ట్‌తో శనివారం జిల్లాలో టీడీపీ నేతలు కొన్నిచోట్ల ఆందోళనలు చేపట్టారు. దుకాణాలు మూయించేందుకు యత్నించారు. వాహనాల రాకపోకలను అడ్డుకునేందుకు రోడ్లపై టైర్లు కాల్చారు. అయితే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో తమ్ముళ్ల ఆగడాలు సాగలేదు. దీంతో చేసేదిలేక నామమాత్రంగా నిరసన తెలిపి తిరుగుముఖం పట్టారు.

అధినేత అవినీతి బట్టబయలు కావడంతో టీడీపీ నేతలు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. జనం సొమ్మును అప్పనంగా దోచుకున్న కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్ట్ కావడంతో కంగుతిన్నారు. అల్లర్లు సృష్టించి సానుభూతి పొందాలని భావిస్తే ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో మింగలేక.. కక్కలేక మిన్నకుండిపోయారు. తూతూమంత్రంగా నిరసనలు చేపట్టి మమ అనిపించేశారు. ఈ క్రమంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. తప్పు చేస్తే ఎంతటివారైనా తప్పించుకోలేరని స్పష్టం చేశారు. చంద్రబాబు పాపం ఇన్నాళ్లకు పండిందని వెల్లడించారు.

- **కుప్పం :** సరిహద్దులోని జాతీయ రహదారిపై టీడీపీ కార్యకర్తలు చెట్టు నరికి అడ్డంగా వేశారు. ఎమ్మెల్సీ భరత్ ఇంటి వద్ద కొందరు నిరసన తెలిపేందుకు యత్నించారు.
- **పూతలపట్టు :** నియోజకవర్గంలోని కొన్ని చోట్ల బలవంతంగా దుకాణాలు మూయించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నించారు. స్థానికులు తిరగబడడంతో వెనుదిరిగారు.



రోడ్డుకు అడ్డంగా వేసిన చెట్టు

- **చిత్తూరు :** ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగలేదు. ఆర్టీసీ బస్సులు యధావిధిగా నడిచాయి.
- **పలమనేరు :** అక్కడక్కడా టీడీపీ నాయకులు నామమాత్రపు నిరసనలు తెలిపారు.
- **నగరి :** పుత్తూరు రూరల్ మండలం వేపగుంట క్రాస్ వద్ద టీడీపీ నేతలు టైరు కాల్చి రోడ్డుపై బైఠాయించారు. వాహనాల రాకపోకలు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.
- **జీడీ నెల్లూరు :** నియోజకవర్గంలోని కొన్ని చోట్ల టీడీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.
- **పుంగనూరు :** నియోజకవర్గంలో ఎలాంటి నిరసనలు జరగలేదు. జీవజీవనం సాధారణంగా ఉంది.

అవినీతి జరిగిందనే..



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరిట రూ. వందల కోట్ల అవినీతి జరిగిందనే చంద్రబాబును అరెస్ట్ చేశారు. స్వలాభం కోసం బాబు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పటికీ బయటపడని స్కామ్‌లు చాలా ఉన్నాయి. అమరావతిలో భవనాలు, రోడ్ల నిర్మాణాల కోసం రూ.118 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు కూడా అందరికీ అర్థమైంది. తప్పు జరిగితే చట్టం ఎవరినైనా శిక్షిస్తుంది. టీడీపీ పాలనలో అవినీతి రాజ్యమేలింది. అమరావతిలో పంటలు పండే భూమిని తీసుకొని రాజధాని నిర్మాణం పేరుతో రూ.కోట్లు దోచుకున్నారు. అక్కడ నాసిరకంగా కట్టిన తాత్కాలిక కార్యాలయాలు కొద్దిపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్య తీసుకువచ్చేందుకే పుంగనూరు, భీమవరంలో అలజడులు సృష్టించారు.

– ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, చిత్తూరు

జనం సొమ్ము కాజేసినందుకే..



జనం సొమ్మును కాజేసినందుకే చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. స్కిల్ శిక్షణ పేరుతో రాష్ట్ర యువత భవిష్యత్తును తాకట్టు పెట్టి, ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్నందుకు శిక్ష అనుభవించక తప్పదు. ఈ స్కామ్‌లో ఉన్న టీడీపీ నేతలను కూడా వదిలిపెట్టకూడదు. చంద్రబాబు ఆదేశాల మేరకే టీడీపీ నేతల ఖాతాల్లోకి నగదు వెళ్లిందని సీఐడీ అధికారులు గుర్తించారు. చంద్రబాబు అరెస్టులో ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశాలు లేవు. అసలు విషయం పక్కకు వెళ్లేందుకే టీడీపీ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారు.

– మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్

తప్పు చేస్తే శిక్ష తప్పదు



తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయడంపై టీడీపీ నేతలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు. దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి తదితరులు వత్తాసు పలకడం చూస్తుంటే అందరు దొంగలు ఒక్కటైనట్లు తెలుస్తోంది. ప్రజాసంక్షేమం కంటే బాబు క్షేమమే పవన్ కల్యాణ్‌కు ముఖ్యంలా ఉంది. చేసిన అవినీతి తెలుసు కనుకే చంద్రబాబు మూడు రోజులుగా తనను అరెస్ట్ చేస్తారని చెప్పారు. సీఐడీ పోలీసులు అరెస్టు చేయడానికి వస్తే బస్సులో దాక్కోవడం చూస్తుంటే ఎంత పిరికివారో అర్థమవుతోంది. చంద్రబాబు అరెస్ట్‌తో ఎన్టీఆర్ ఆత్మ నిజంగా శాంతిస్తుంది.

– ఎంఎస్ బాబు, ఎమ్మెల్యే, పూతలపట్టు

ఉనికి కోసమే..



అవినీతికి పాల్పడినందుకే చంద్రబాబును అరెస్ట్ చేశారు. కేవలం ఉనికి కోసమే టీడీపీ నేతలు జిల్లాలో ఆందోళనకు దిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమాత్రం కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదు. నిజంగా సాధించాలనుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబును కటకటాల వెనక్కి నెట్టేది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారించారు. కీలక ఆధారాలు లభించిన తర్వాతే అరెస్ట్ చేశారు. నీతి నిజాయితీ అంటూ చిలకపలుకులు వల్లించే చంద్రబాబుకు తప్పు చేయకుంటే భయం ఎందుకు.

– శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఇదీ బాబు బాగోతం



నలభై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా అంటూ వల్లించే చంద్రబాబు అసలు బాగోతం ఇది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో ఆయన దోపిడీని చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. ఇన్నేళ్లుగా వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ వస్తున్న చంద్రబాబు పాపాల పుట్ట ఇప్పుడు పగిలింది. షెల్ కంపెనీలను సృష్టించి రూ.371 కోట్ల ప్రజాధనాన్ని యథేచ్ఛగా దోచుకున్నారు. అవినీతి కేసులో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేస్తారని చంద్రబాబుకు ముందే తెలుసు. సుమారు రెండేళ్ల పాటు క్షుణ్ణంగా విచారించిన సీఐడీ పోలీసులు పక్కా ఆధారాలతోనే బాబును అరెస్ట్ చేశారు. దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి సంబంధం లేదు. తప్పు చేసిన చంద్రబాబుకు శిక్ష తప్పదు.

– ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

ఎన్నాళ్లో తప్పించుకోలేరు



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుది రాజకీయ కోణంలో జరిగిన అరెస్ట్ కాదు. చంద్రబాబు ఇప్పటికి ఎన్నో కుంభకోణాలు చేసి ఆయా కేసుల్లో స్టేలు తెచ్చుకున్నారు. తప్పు చేసిన వాళ్లు ఎన్నాళ్లో తప్పించుకోలేరు. అందుకే ఈ కేసులో ఆధారాలతో ఆయన దొరికిపోయారు. గతంలో చేసిన పాపాలే ఆయనకు శాపాలుగా మారాయి. చంద్రబాబు అరెస్ట్‌పై జనం ఆనందంగా ఉన్నారు.

– వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

నేడు వరసిద్ధుని ఆలయంలో సంప్రోక్షణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ది వినాయక స్వామి ప్రధాన ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపం, ధ్వజస్తంభానికి రాగి తొడుగులు, షోడశ గణపతుల మండపాలకు ఆదివారం సంప్రోక్షణ నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ దాతల సహకారంతో అద్దాల మండపం నిర్మించామని, ధ్వజస్తంభానికి రాగి రేకుల తొడుగుల వేయించామన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల లోపు సంప్రోక్షణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక హోమపూజలు

అద్దాల మండపం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సంస్థ అధినేత మహేష్ కుమార్ రెడ్డి రూ.కోటి విరాళం అందించారు. సంప్రోక్షణ చేయనున్న క్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కలసి హోమం, పూజలకు సామాగ్రిని మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకోచ్చారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా హోమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజాసామగ్రిని తీసుకొస్తున్న దాత కుటుంబ సభ్యులు, ఆలయ చైర్మన్, ఈఓ

పలువురికి ఉద్యోగోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని ఐదుగురు ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతి కల్పించారు. వెంకటనారాయణ(తిరుపతి గ్రామీణ), సుధాకర్ (వెదురుకుప్పం), రామచంద్ర(కేవీబీపురం), శ్రీదేవి(జీడీనెల్లూరు), శివయ్య (పీఆర్ కార్యాలయం) డీఎల్‌డీఓ ఉద్యోగోన్నతి పొందారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖలో ఇద్దరికి ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి ఇస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జెడ్పీ కార్యాలయ ఏఓ శ్రీనివాసులును తిరుపతికి, రామచంద్రాపురం మండల పరిషత్ ఏఓ రఫీని చిత్తూరుకు కేటాయిస్తున్నట్లు పేర్కొంది.

టీచర్ల శిక్షణ కోర్సులకు ఫిర్కీ యాప్



సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లలో బోధన సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ కోర్సుల కోసం ఫిర్కీ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ఫిర్కీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. అభ్యాస ఫలితాలు, బోధన పద్ధతుల్లో నాణ్యత పెంపే లక్ష్యంగా చేపట్టిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) కార్యక్రమంలో కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 3 నుంచి 10 వ తరగతి వరకు టీచర్ల బోధన సామర్థ్యాలను పెంచేందుకు కోర్సులు అమలు చేస్తున్నామని తెలిపారు. వీటిని బ్లెండెడ్ మోడల్ విధానంలో టీచర్లకు అందిస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్ శిక్షణలో వీడియోలు, రీడింగ్ మెటీరియల్, పలు రకాల టెస్టులు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ కోర్సులను ఫిర్కీ యాప్‌లో చేపడతామని వివరించారు. జిల్లాలోని టీచర్లందరూ నవంబర్ 30వ తేదీ లోపు కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే తో భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భూ వివాదాలకు తెరదించేదుకే వైఎస్సార్ శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం అమలు చేస్తున్నామన్నారు. సర్వేని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో మూడో విడత రీ సర్వే వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు లోపు 105 గ్రామాల్లో సర్వే రాళ్ల నాటే ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

గురుదేవోభవ



నూతన వస్త్రాలు అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: సమాజంలో ఒక వ్యక్తి, నడకకు, నడతకు, పురోగతికి, శ్రేయస్సుకు గురువు నిర్దేశించే మార్గం తప్పనిసరి. వ్యక్తి వికాసానికైనా, దేశ వికాసానికైనా ఉత్తమ గురువు ప్రోత్సాహం, అనుగ్రహం, ఆశీర్వాదం అనివార్యం. ఒక్క మాటలో చెప్పాలంటే గురువంటే వెలిగే దీపం వంటి వారని, అంతటి గొప్పతనం కలిగిన గురువులను సత్కరించుకుకోవడం తన పూర్వజన్మ సుకృతమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను బోధిస్తున్న 1,800 మంది గురువులను ఘనంగా సన్మానించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒక్కొక్క ఉపాధ్యాయున్ని ఆత్మీయంగా పలుకరిస్తూ శాలువతో సత్కరించి కొత్త బట్టలు, స్వీట్లు చేతికిచ్చి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. కార్యక్రమానికి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు


జయచంద్ర

గుడిపాల: మండలంలోని మొగరాళ్లపల్లె పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన చిన్నబ్బునాయుడు కుమారుడు జయచంద్ర (23) అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చలపతి తెలిపారు. వివరాలు.. ఈనెల 6వ తేదీన జయచంద్ర గుంటూరు జిల్లాలో ఆర్మీ సెలక్షన్ కోసం బయలుదేరి వెళ్లాడు. 7వ తేదీన సెలక్షన్‌కు వెళ్లి ఇంటికి ఫోన్‌చేసి సాయంత్రం ట్రైన్‌లో బయలుదేరుతున్నట్లు చెప్పాడు. అయితే ఇంటికి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో చిన్నబ్బునాయుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు.

టీ-20 జిల్లా జట్టు ఎంపిక

పాకాల:మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్ మైదానంలో శనివారం టీ-20 జిల్లా జట్టును ఎంపిక చేశారు. టీ-20 అసోసియేషన్ కార్యదర్శి జీ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ వివేక్, వియజ్, సంజయ్, జగత్‌కుమార్, నగేష్, ప్రశాంత్, దినేష్, మనోజ్, వినిత్‌కుమార్, జశ్వంత్, కే.దినేష్, సంతోష్‌కుమార్, మోహిత్‌కృష్ణ, నితిన్, అజయ్ కుమార్, పరేరసన్ ఎంపికైనట్టు వెల్లడించారు.

మిట్టపాళెం.. శోకసంద్రం

- రోడ్డుప్రమాద మృతులకు అంత్యక్రియలు
- కన్నీరుమున్నీరైన బంధువులు, గ్రామస్తులు


మిట్టపాళెంలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు, గ్రామస్తులు

నగరి : ఒకే కుటుంబంలో నలుగురు మృత్యువాత పడటంతో మిట్టపాళెం శోకసంద్రమైంది. నూతనంగా నిర్మించుకున్న ఇంటి వద్దకు ఆ కుటుంబ సభ్యులంతా మృతదేహాలుగా రావడం అందరినీ కలచివేసింది. తమ కంటిముందు ఆనందంగా తిరిగిన నలుగురూ విగతజీవులుగా మారడంతో గ్రామస్తులు తట్టుకోలేక పోయారు. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు తమకంటూ ఒక ప్రపంచాన్ని సృష్టించుకుని సంతోషంగా జీవించిన కుటుంబం ఒక్కసారిగా మట్టిలో కలిసిపోయింది. నాలుగు మృతదేహాలకు ఒకే ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించారు. కన్నా లేరా... అమ్మా లేమ్మా అంటూ మృతదేహాల వద్ద భూపాలన్ తల్లి రోదిస్తుండడం అందరినీ కలచివేసింది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదంటూ జనం కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. అండగా ఉంటామని ఓదార్చారు.

కన్నన్ కుటుంబీకుల రోదనలు

శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కన్నన్ కుటుంబ సభ్యులు విషయం తెలిసి శనివారం నగరి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. భర్త కన్నన్ మరణించడం, కుమారుడు తిరునావుక్కరసు మృత్యువుతో పోరాడుతుండడం చూసి ఆమె చలించిపోయింది. కాసేపు అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆమె ఆవేదన చూపరులను కన్నీరు పెట్టించింది. తనకు భర్త, బిడ్డే ఆధారమని ఈ పరిస్థితిలో వారిని చూడాల్సి వచ్చిందే అంట రోదించింది. కన్నన్, తిరునావుక్కరసుది తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలుకా, ఎల్లుపారై గ్రామమని బంధువులు తెలిపారు. జాతీయ రహదారి విభాగం అధికారులు రూ.10 లక్షల నష్టపరిహారం అందజేస్తామని చెప్పినట్లు వెల్లడించారు.


ఆస్పత్రి వద్ద కన్నన్ భార్య ఆవేదన


కన్నన్ (ఫైల్)

వానదేవుడా కరుణించు!


పూజా సామగ్రితో వస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం దంపతులు

- సమృద్ధిగా వర్షాల కోసమే వరుణ యాగం
- టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి

చంద్రగిరి: సకలజన సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తూ, అందుకు అత్యంత అవసరమైన వరుణదేవుని అనుగ్రహం సమృద్ధిగా ఉండాలని అభిలాషిస్తూ, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ టీటీడీ వరుణ యాగానికి శ్రీకారం చుట్టినట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం శ్రీనివాసమంగాపురం ఆలయంలో అష్టోత్తర శత కుండాత్మక మహా శాంతి వరుణ యాగాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. తొలి రోజు వాస్తుహోమం, అకల్మషహోమం, పంచగవ్య ప్రాశనం, రాక్షాబంధనం, గజపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రక్షాబంధనం, గజపూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వానదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు మూడు రోజుల పాటు ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వాతావరణంలో ఈ ఏడాది, వచ్చే ఏడాది అతి తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు తెలిపారన్నారు. శ్రీవారి అనుగ్రహంతో తిరుమల ధర్మగిరిలో ఆగస్టు 21 నుంచి 26వ తేదీ వరకు కరీరిష్టి వరుణజప మహా శాంతి యాగం నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ యాగం నిర్వహణ వల్ల తిరుమల, తిరుపతిలో మంచి వర్షాలు పడుతున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 11న గోపూజ, మహా పూర్ణాహుతితో ఈ యాగం ముగుస్తుందన్నారు. ఈ యాగంలో మూడు రాష్ట్రాలకు చెందిన 200 మందికి పైగా రుత్వికలు పాల్గొన్నట్లు తెలిపారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు

ఫలించిన 'అదాలత్'

- రెండు కుటుంబాల నడుమ భూవివాదం
- 14 ఏళ్ల కేసుకు పరిష్కారం


వాదులు, ప్రతివాదులతో జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు: పద్నాలుగేళ్లుగా కక్షలతో రగిలిన రెండు కుటుంబాలు ఎట్టకేలకు ఏకమయ్యాయి. లోక్ అదాలత్ వేదికగా న్యాయమూర్తుల చొరవతో వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. తాతల నాటి నుంచి వెంటాడుతున్న సమస్య తీరడంతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎందరికో స్ఫూర్తినిస్తున్న ఈ కేసు వివరాలు.. కుప్పం నియోజకవర్గం గుడుపల్లెకు చెందిన కృష్ణప్ప, చిన్నప్ప వరసకు అన్నదమ్ములు. 2011లో వీరి మధ్య కేవలం 1.10 ఎకరాల విషయంలో వివాదం ఏర్పడింది. దీనిపై కృష్ణప్ప చిత్తూరు అడిషనల్ డిస్ట్రిక్ కోర్టులో దావా వేశారు. ఆపై పలమనేరు సబ్‌కోర్టుకు ఈ కేసు బదిలీ అయ్యింది. కొంతకాలానికి కృష్ణప్ప మృతి చెందడంతో వారసులుగా భార్య చిన్నక్క, కుమార్తెలు రత్నమ్మ, మీనాక్షి, కుమారులు చిన్నప్ప, రఘురామప్ప, సుందరప్ప పట్టువిడవకుండా కేసు కొనసాగించారు. తర్వాత చిన్నప్ప మృతి చెందడంతో ఆయన వారసులు వెంకటలక్ష్మమ్మ, జయమ్మ, పార్వతమ్మ, దేవేంద్ర, వెంకటలక్ష్మి, లక్ష్మీపతి, ఉమాపతి కేసులో ప్రతి వాదులుగా చేరారు. ఈ కేసులో వాదులకు నటరాజన్, ప్రతివాదులకు చంద్రశేఖర్ న్యాయవాదులుగా వ్యవహరించారు. ఇప్పటిదాకా ఏడాదికి 30 వాయిదాల చొప్పున 14 ఏళ్లలో 520 వాయిదాలకు వీరు కోర్టుకు హాజరయ్యారు. ఇందుకోసం ఇరువర్గాల వారు సుమారు రూ.10లక్షల చొప్పున ఖర్చుపెట్టారు. అంటే కేవలం రూ.10లక్షల ఆస్తి కోసం దాయాదులు రెట్టింపు ఖర్చు పెట్టారు. ఈ కేసులో మూడో తరానికి చెందిన ఇరువురి కుటుంబాల పిల్లలు కాస్త ఆలోచించారు. తాత, ముత్తాలు సంపాదించి ఆస్తి విషయంలో వివాదాలు ఎందుకని భావించారు. ఇదే సమయంలో పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు వారం క్రితం కుప్పం క్యాంపు కోర్టులో ఇరువర్గాల న్యాయవాదులు, కక్షిదారులను పిలిపించి మాట్లాడారు. కేసులు కారణంగా వారు పోగొట్టుకున్న సమయం, డబ్బు, బాధలు, బాంధవ్యాలను గుర్తు చేశారు. దీంతో వారు రాజీకి వెళ్తామని న్యాయమూర్తి ముందు ఒప్పుకున్నారు. ఈ క్రమంలో శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్నారు. ఫిర్యాదీ కుటుంబీకులకు రెండు భాగాలు, ప్రతివాది వర్గానికి ఓ భాగం ఇచ్చేలా న్యాయమూర్తి రాజీ చేశారు.

వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ క్రీడా మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో(ఎస్‌జీఎఫ్)అండర్-19 వాలీబాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 16మంది బాలురు, 16మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరు త్వరలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు.

ఏకాకి జీవితం నాది!


శాంతమ్మ మృతదేహంపై వాలిన కాకి

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లెలో జరిగిన అంత్యక్రియల్లో ఓ కాకి హల్‌చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చెన్నప్ప భార్య శాంతమ్మ బుధవారం బోయకొండ గంగమ్మ దర్శనానికి వెళ్లింది. అనారోగ్యానికి గురై గురువారం అక్కడే మృతి చెందింది.కుటుంబీకులు, గ్రామస్తులు శుక్రవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకు వచ్చారు. అంత్యక్రియల కోసం గ్రామ సమీపంలోని శ్మశాన వాటికకు తీసుకువెళ్లారు. ఇంతలో అక్కడకి ఓ కాకి చేరుకుంది. మృతదేహం చుట్టూ చల్లిన పిండం, బియం తింటూ ఉండిపోయింది. తరిమినా వెళ్లకుండా దాదాపు అరగంట పాటు గుంతలోకి పూలు, మట్టి వేస్తూ మృతదేహం చుట్టూ తిరిగింది. ఈ ఘటనను ఎవరో వీడియో తీయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.